# అంతర్ముఖమైన ఆత్మతత్త్వాన్ని గుర్తించినవాడే నిజమైన విద్యావంతుడు

ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము
ప్రేమను ప్రేమతో సంధింప నీమమగును
కాన ప్రేమను గట్టిగా కలిగియుండి
ఐకమత్యము చూపుడీ బాలులార!

ప్రియమైన విద్యార్థులారా! విద్యార్థినులారా! మానవ జన్మ పవిత్రమైనటు వంటిది. ఎందుచేతననగా, 'దైవం మానుషరూపేణ'. భగవంతుడు మానవ రూపమును ధరిస్తున్నాడు. భగవంతుడంటే ఒక ప్రత్యేకమైన రూపము కలిగినవాడని మీరు భావించకూడదు. భగవంతుడు మనిషికంటే వేరుగా లేడు; మనిషియందే తాను ఆత్మస్వరూపుడై ఉన్నాడు. పంచభూతాత్మకమైనటువంటి మానవ దేహమును నడిపించే శక్తిని 'ఆత్మ' అన్నారు. ఆత్మ అనగా ఏమిటి? దాని స్వరూపమేమిటి? అని అనేకమంది ప్రశ్నిస్తుంటారు. ఆత్మతత్త్వము రూప నామములకు అతీతమైనది. ఆకారము మాత్రమే మానవత్వమును నిరూపించదు. మానవత్వమనేది ప్రవర్తనపై ఆధారపడి ఉంటుంది. అదేవిధముగా, కేవలం గ్రంథపరిచయం సంపాదించినంతమాత్రాన మానవుడు విద్యావంతు డనిపించుకోడు. గ్రంథపరిచయము నెగెటివ్ విద్య. నిజమైన విద్యకు వేరే పేరున్నది. అదే 'ఎడ్యుకేర్'. అట్టి విద్యను అభ్యసించేవాడే నిజమైన విద్యార్థి.

**'ఎడ్యుకేషన్' - 'ఎడ్యుకేర్'**

'ఎడ్యుకేషన్' వేరు, 'ఎడ్యుకేర్' వేరు. 'ఎడ్యుకేషన్' అనేది 'ఇన్ఫర్మేషన్' (సమాచారము)ను అందిస్తుంది. 'ఎడ్యుకేర్' అనేది 'ట్రాన్స్ఫర్మేషన్' (పరివర్తన)ను

sri sathyasai vachanamrutam

చేకూర్చుతుంది. 'ఎడ్యుకేషన్' కేవలం శారీరక, మానసిక స్థాయిలకు పరిమితమైనది; భౌతిక విషయ పరిజ్ఞానమును మాత్రమే అందిస్తుంది. 'ఎడ్యుకేర్' అనేది అంతర్భావమును పరిశుద్ధం గావిస్తుంది, చిత్తశుద్ధిని చేకూర్చుతుంది. మన మాటయినా, పాటయినా, బాటయినా ప్రతి ఒక్కటీ హృదయమునుండి ఉద్భవించాలి. అదే 'ఎడ్యుకేర్'. అంతర్ముఖమైన తత్త్వాన్ని గుర్తింపజేసేది 'ఎడ్యుకేర్'. బహిర్ముఖమైన తత్త్వాన్ని బోధించేది 'ఎడ్యుకేషన్'. అంతర్ముఖమైన భావమే బహిర్ముఖమైన చర్యగా అభివ్యక్తమౌతున్నది. అంతర్ముఖమైన తత్త్వమును మనం గుర్తించుకుంటే బహిర్ముఖమైన తత్త్వము సులభంగా అర్థమవుతుంది. అనుభవజ్ఞులైన మహనీయులు మాత్రమే ఈవిషయాన్ని చక్కగా అర్థం చేసుకో గలరు. సామాన్యులైతే గొప్పగొప్ప డిగ్రీలను పొందడమే విద్యకు పరమావధిగా భావిస్తారు. గొప్పగొప్ప డిగ్రీలు పొందినవారందరూ విద్యావంతులు కాజాలరు. ఈనాడు విద్యావంతులుగా పిలువబడేవారెవ్వరూ 'ఎడ్యుకేర్' అంటే ఏమిటో పరిశీలన చేయడం లేదు. కేవలం గ్రంథములలో ఉన్న విషయాలను గుర్తించుకొని తిరిగి వాటినే పరులకు బోధిస్తున్నారు. ఈనాటి విద్యార్థులు బి.ఎ., ఎమ్.ఎ., సి.ఎ.– ఇలాంటి ఎన్నో డిగ్రీలను సంపాదిస్తున్నారు. ఇవన్నీ బాహ్యమైనటువంటివి. అంతర్భావమును, అంతర్ముఖమైన తత్త్వాన్ని అర్థం చేసుకునేవారు ఈనాడు చాలా అరుదుగా ఉన్నారు. అంతర్ముఖమైన తత్త్వాన్ని అర్థం చేసుకున్నప్పుడే మనం తరిస్తాము.

విద్యార్థులారా! మీ విద్యను సమాజ శ్రేయస్సుకై వినియోగించాలి. మీ కోపతాపాలను అదుపులో ఉంచుకోవాలి. నిగ్రహం పాటించాలి. అధ్యాపకులు బోధించిన విషయాలతోపాటు శరీరము, మనస్సు, బుద్ధి, చిత్తము, ఇంద్రియాల తత్త్వాన్ని అర్థం చేసుకొని మిమ్మల్ని మీరు తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ప్రతి వ్యక్తీ సత్త్వ, రజో, తమోగుణములతో కూడి ఉన్నాడు. ఈ త్రిగుణములకే త్రిమూర్తులని పేరు పెట్టారు. సత్త్వగుణము అంతశ్శుద్ధికి సంబంధించినది. రజోగుణము మన చర్యలలో ప్రతిబింబిస్తుంది. మీరు చేసే పనులు, ఆడే ఆటలు ఇవన్నీ రజోగుణమునుండి వచ్చినవే! దేహములోని సర్వాంగములను తన అధీనంలో ఉంచుకొన్న ఆత్మయే మూలాధార తత్త్వం. అదియే సత్యము, నిత్యము.

sri sathyasai vahini

**వ్యక్తికి ముఖ్యంగా ఉండవలసిన గుణములు మూడు**

ఈనాడు కొందరు స్వార్థమునాధారం చేసుకొని పరార్థమును బోధిస్తున్నారు. ఇది చాలా పొరపాటు. మొట్టమొదట స్వార్థాన్ని త్యజించాలి. అంతర్భావంలో ఉన్న పవిత్రమైన ప్రేమను ఆధారం చేసుకొని, పరార్థ దృష్టితో మీ కర్తవ్యకర్మలను నిర్వర్తించాలి. దైవవిశ్వాసాన్ని కలిగియుండాలి. దైవమే ఈ జగత్తున కంతటికీ ఆధారము. ఆ ఆధారము లేకపోతే ఈ ఆధేయము లేనే లేదు. ఇక్కడ ఈ హాలును అనేక బల్బులతో అలంకరించారు. ఈ బల్బులన్నింటినీ ప్రకాశింపజేసే కరెంటు ఒకటే కదా! అదేవిధముగా, రూపనామములు వేరువేరైనప్పటికీ దివ్యత్వము ఒక్కటే. కాని, మీరు కేవలం రూపనామములపై దృష్టి పెట్టి అంతర్లీనంగా ఉన్న దివ్యత్వాన్ని విస్మరిస్తున్నారు.

ప్రతి వ్యక్తికీ ముఖ్యంగా ఉండవలసిన గుణములు మూడు – నిశ్చలత్వము, నిర్మలత్వము, నిర్మోహత్వము. ఈ మూడూ కలిగినవాడు దైవసమానుడు. ఒక వ్యక్తియొక్క మంచి, చెడ్డలు అతని ప్రవర్తనను పురస్కరించుకొనియే నిర్ణయించడం జరుగుతుంది. కాబట్టి, మనం మంచివారమా, లేక చెడ్డవారమా అనేది పరులను అడుగనక్కర్లేదు. మన అంతరాత్మయే మనకు సాక్షి. మనం మంచివారిగా రూపొందాలంటే నిరంతరం భగవచ్చింతన చేయాలి. ధర్మసంస్థాపనకై ప్రతి యుగంలోను భగవదవతారములు వస్తుంటాయి. ఐతే, అన్ని అవతారములలోను అంతర్లీనంగా ఉండే భగవత్తత్త్వము ఒక్కటే. 'దైవం మానుషరూపేణ'. భగవంతుడు మానవరూపములో అవతరించినప్పుడు తాను మానవునిగానే నటిస్తాడు. ఎందుకోసం? తాను మానవునిగా సంచరించినప్పుడే మనుష్యులకు మానవత్వమంటే ఏమిటో చక్కగా అర్థమవుతుంది.

**ఆత్మవిద్యను బోధించే ఉద్దేశ్యంతోనే మేము విద్యాసంస్థలను స్థాపించాము**

ప్రాణము ఎక్కడినుండి వచ్చింది? ఎవరిచ్చారు? ఏ సాధనచేత దానిని మీరు సాధించారు? ప్రాణము నిచ్చేదీ, పోషించేదీ భగవంతుడే! దివ్యత్వమునకు మానవుడు అనేక రూపనామములను కల్పిస్తున్నాడు. అది చాలా పొరపాటు. అది కేవలం ఒక భ్రమ. భగవంతుడు ఒక్కడే. 'ఉన్నాడయా దేవుడున్నాడయా'. అట్టి విశ్వాసాన్ని మీరు దృఢం

sri sathyasai vachanamrutam

చేసుకోండి. మీరు దైవాన్ని పూజిస్తున్నారు, భజిస్తున్నారు, కీర్తిస్తున్నారు. ఐతే, దైవం ప్రత్యేకంగా ఎక్కడో ఒక ప్రదేశంలో ఉన్నట్లు మీరు భావిస్తున్నారు. సర్వత్రా నిండియున్న పంచభూతములే పరమాత్మ స్వరూపాలు. మీ హృదయమే దైవమందిరము. కాబట్టి, మీ హృదయాన్ని ప్రేమతో నింపుకోండి. ప్రేమ లేనివాడు మనిషే కాడు. భగవంతుడు ప్రతి వ్యక్తియందు ఆత్మస్వరూపుడై ఉన్నాడు. చక్కెరతో మనము అనేక స్వీట్లు తయారు చేస్తాము కదా! అదేరీతిగా, ఒకే ఆత్మ అనేక రూపాలను ధరిస్తున్నది. 'ఏకోహం బహుస్యాం'. అన్ని రూప నామములూ ఆత్మనుండియే బయలుదేరుతున్నాయి. సర్వజీవులయందున్న సమత్వమే ఆత్మతత్త్వము. అన్ని జీవులూ ఆత్మలోనే లీనమై ఉన్నాయి.

మతములన్నియు వేరు, మార్గంబు ఒక్కటె
వస్త్ర భేదము వేరు, వస్తువొకటే
శృంగారములు వేరు, బంగారమొక్కటె
పశుల వన్నెలు వేరు, పాలు ఒకటె
జీవజంతులు వేరు, జీవుండు ఒక్కడె
కులములన్నియు వేరు, పుటుక ఒకటె
దర్శనంబులు వేరు, దైవమ్ము ఒక్కటె
పూల వన్నెలు వేరు, పూజ ఒకటె
తెలియలేకను మానవులు తెలివి తప్పి
బ్రతుకుకోసం బహుబాధ బద్ధులైరి
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపఱతు?

సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

భిన్నత్వంలో ఏకత్వమును దర్శించడానికి బదులు మానవుడు ఏకత్వమును భిన్నత్వంగా విభజిస్తున్నాడు. అందుచేతనే పలు బాధలకు గురి అవుతున్నాడు. సృష్టి అంతటికీ ఆత్మయే మూలాధారం. పంచభూతముల ఏకత్వమే ఆత్మతత్త్వం. మనము దేనిని మరచినా ఆత్మను మాత్రం మరువకూడదు. ఆత్మనుండియే సకల జగత్తు ఆవిర్భవిస్తున్నది. ఒక్క

srisathyasaivachanamrutam

ఆత్మతత్త్వమును అర్థం చేసుకుంటే అన్నీ మనకు అర్థమవుతాయి. ఇటువంటి ఆత్మవిద్యను బోధించే ఉద్దేశ్యంతోనే మేము విద్యా సంస్థలను స్థాపించాము. లేకపోతే, ఈ స్కూళ్ళను, కాలేజీలను మేమెందుకు స్థాపించాలి? మా కాలేజీలలో సత్ప్రవర్తన, సద్గుణములు, సదాచారములకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడుతున్నది. ప్రతి ఒక్కరూ ఇట్టి పవిత్రమైన మార్గమును అనుసరించి, భగవంతుని చేరుకోవాలనే కోరికను అభివృద్ధిపరచుకోవాలి. ఆవిధమైన కోరిక లేకపోతే ఇక మానవునిగా పుట్టి ప్రయోజనమేమిటి?!

**చిత్తశుద్ధి లేని సాధన నిరర్థకం**

చిత్తము పరిశుద్ధంగా ఉన్నప్పుడే మనకు సర్వమూ సిద్ధిస్తుంది. కొంతమంది ఊరికే చేతిలో జపమాలను త్రిప్పుతుంటారు. కేవలం మాల త్రిప్పినంత మాత్రమున అది జపమవుతుందా? ప్రాపంచికమైన, లౌకికమైన విషయములను మరచి భగవచ్చింతన చేయడమే నిజమైన జపము. తనయొక్క మూలాధార తత్త్వమును గుర్తించినవాడే నిజమైన మానవుడు. భగవద్గీతలోని శ్లోకాలను కంఠస్థం చేసినంతమాత్రమున ప్రయోజనం లేదు. ఏ ఒక్క శ్లోకాన్నైనా ఆచరణలో పెడితే చాలు. ధ్యానము పేరిట ఊరికే కళ్ళు మూసుకుని కూర్చుంటే భగవంతుడు కనిపిస్తాడా? భగవంతుడు కనిపించడం మాట అటుంచి అసలు మీ ఎదురుగా ఉన్న వ్యక్తులే మీకు కనిపించరు. భగవంతుడు మీయందే అవ్యక్తంగా ఉన్నాడు. అవ్యక్తంగా ఉన్న దివ్యత్వాన్ని వ్యక్తం గావించుకొనేవాడే నిజమైన వ్యక్తి. ఆత్మతత్త్వాన్ని అర్థంచేసుకొని తగిన సాధన సల్పితే మీరు తప్పక ఆత్మసాక్షాత్కారము ననుభవించగలరు. ఎంత జపము చేసినా, ఎంత తపము చేసినా చిత్తశుద్ధి లేకపోతే ప్రయోజనం లేదు. మీరు ఏ సాధన చేసినప్పటికీ మీ మనస్సును ఆత్మతత్త్వంపై లగ్నం చేయాలి. తుమ్మెద పుష్పముపై వ్రాలి మకరందమును గ్రోలినట్లుగా మీ మనస్సు ఆత్మపై కేంద్రీకృతం కావాలి.

**'మా - న - వ'**

మనసు గలవాడే మనిషి. మనసుకు అతీతమైన స్థితిని సాధించాలి. మనిషికి మరో పేరు మానవుడు. 'మానవ' అంటే అర్థమేమిటి? 'మా' – అనగా మాయ, మమత్వము. 'న' –

sri sathyasai vachanamrutam

అనగా నాస్తి. 'వ' – అనగా వర్తించుట. మాయను జయించి, ఆత్మవిద్యను నేర్చి దానిని తన ప్రవర్తనలో నిరూపించేవాడే మానవుడు. మాధవుడు తనకంటే వేరుగా లేడనే నమ్మకముతో జీవితములో ఎదురయ్యే కష్టనష్టములను ధైర్యంగా ఎదుర్కోవాలి. నమ్మకము, ధైర్యము, సాహసము మున్నగు లక్షణాలు గలవాడే మనిషి. 'డైమండ్' విలువ తెలిసినవాడు దానిని జాగ్రత్తగా భద్రపరచుకొని సద్వినియోగం చేస్తాడు. అదేరీతిగా, మనస్సుయొక్క శక్తిని గుర్తించినవాడు దానిని ప్రాపంచిక విషయాలపై మరలనీయక దైవ చింతనలో ప్రవేశపెడతాడు. మనము 'డై-మైండ్' (మనోనాశనం) కొరకు పాటుపడాలి. 'మనోమూల మిదం జగత్' అన్నారు. మనస్సును జయించకుండా మనము కల్పితమైన గుణములను పెంచుకుంటూ పోతే మన గతి ఏమవుతుంది?! మనోనాశనము జరిగినప్పుడే మానవుడు పరమహంస అవుతాడు. మనస్సును మనం అనుసరించకూడదు. అది అందించే ఫలము పైకి మంచిగా ఉన్నట్లుగా కనిపిస్తుందిగాని, అందులో చేదురసము నిండి ఉంటుంది. మనస్సు సహజంగా మధురమైనది, పవిత్రమైనది. కాని, నేటి యువకులు దానిని 'మంకీ మైండు'గా మార్చుకుంటున్నారు. మనస్సుయొక్క తత్త్వాన్ని అర్థం చేసుకోకుండా పెద్దపెద్ద గ్రంథాలు చదివితే వచ్చే లాభమేమిటి? భగవద్గీత చదివేవారు, భగవద్గీతను గురించి చెప్పేవారు మొట్టమొదట అర్థం చేసుకొని ఆచరణలో పెట్టాలి. అర్థం తెలియకుండా మనము ఊరికే చదువుతూపోతే ప్రయోజనమేమిటి?! విద్యార్థులు వేదం నేర్చుకుంటున్నారు. 'అనంతోవై వేదాః'. వేదాలు అనంతమైనవి, అనంతమైన శక్తి కలిగినటువంటివి. ఒకరు ఇష్టపడినా, ఇష్టపడకపోయినా వేదాలు అందరికీ అవసరం. వేదాలను చదివేవాళ్ళు వాటి అర్థాన్ని గుర్తించి వర్తించాలి. ఈనాటి మానవుడు తనను తాను మరచి ఏవో విద్యలు నేర్చుకుంటున్నాడు. అదే మనిషి యొక్క బలహీనత. ఆ బలహీనతచేతనే మానవుడు భగవంతుని తప్ప అన్నింటినీ నమ్ముతున్నాడు.

ప్రియమైన విద్యార్థులారా! ప్రాపంచికమైన, భౌతికమైన విషయాలన్నీ మీకు అర్థమవుతాయి. కాని, అంతర్ముఖమైన తత్త్వము అందరికీ అర్థం కాదు. వేరు వేరుగా గోచరించే రూపనామములన్నింటియందు అంతర్ముఖంగా ఉన్న దివ్యత్వం ఒక్కటే. దివ్యత్వమే ఆధారము; రూపనామములు ఆధేయములు. ఆధారమును గుర్తించకుండా

sri sathyasai vahinamrutam

ఆధేయాన్ని గుర్తించి ప్రయోజనంలేదు. మీరు భౌతికములోకూడా ఆధ్యాత్మికమును గుర్తించాలి. మొట్టమొదట మీరు దైవవిశ్వాసాన్ని పెంచుకోండి. దైవవిశ్వాసాన్ని కలిగియుంటే అన్నింటియందు మీకు విజయం ప్రాప్తిస్తుంది. దైవంపై భారం వేసి మీ కర్తవ్యాన్ని మీరు సక్రమంగా నిర్వర్తించండి. అదే విద్య యొక్క సారము. విద్య అంటే గ్రంథపరిచయం కాదు; దానికి అతీతమైనది.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! దైవత్వము సర్వవ్యాపకమైనదని మీరు మొట్టమొదట గుర్తించాలి. మీరు దైవమునుండియే వచ్చారు, దైవములోనే జీవిస్తున్నారు. కాబట్టి, మీ సర్వకర్మలను దైవానికి ప్రీతికరంగా ఆచరించండి. ఈరీతిగా పవిత్రమైన మార్గాన్ని అనుసరించినప్పుడు మీరు తప్పక దైవాన్ని పొందగలరు. ప్రపంచము బాహ్యమును చూస్తుంది. భగవంతుడు భావమును చూస్తాడు. తాను భావప్రియుడేగాని, బాహ్యప్రియుడు కాదు. కాబట్టి, మీరు మొట్టమొదట మీ అంతర్భావమును పరిశుద్ధం గావించుకోండి. 'నేనెవరు?' అని విచారణ చేయండి.

**నిన్ను నీవు తెలుసుకో!**

ఈనాడు ప్రతి ఒక్కరూ Who are you? (నీవెవరు?) అని ఎదుటి వ్యక్తిని ప్రశ్నిస్తారేగాని, Who am I? (నేనెవరు?) అని ఎవరైనా తమను తాము ప్రశ్నించుకుంటున్నారా? 'నేనెవరు?' అనే ప్రశ్నకు జవాబు తెలుసుకున్నవాడే నిజమైన విద్యావంతుడు. నీవెవరివో, నీ నిజతత్త్వమేమిటో తెలుసుకోకుండా ఇతరులనుగురించి తెలుసుకొని ప్రయోజనమేమిటి? మొట్టమొదట నిన్ను నీవు తెలుసుకోవాలి. ఏకత్వాన్ని గుర్తించినవాడే నిజమైన సాధకుడు.

'ఈమె నా తల్లి', 'ఆయన నా తండ్రి' అంటావు నీవు. ఈ సంబంధ బాంధవ్యములన్నీ మనసుచేత ఏర్పడినవి. మానవత్వములో లౌకికమైన సంబంధ బాంధవ్యములే సత్యమని భావిస్తే ఏకత్వాన్ని అర్థం చేసుకోలేవు. 'నేను రామయ్యను' అంటావు. అయితే, 'రామయ్య' అనేది నీ దేహానికి పెట్టిన పేరు. దేహము నీవు కాదు. 'నేను నేనే' అన్నదే సత్యము. అయితే, 'నేను రామయ్యను' అన్నప్పుడు పేరుకు తగినట్లుగా నీవు నడుచుకోవాలి. నీ నిజతత్త్వాన్ని గుర్తించినప్పుడు అనంతమైన ఆనందాన్ని నీవు అనుభవిస్తావు. ఇక్కడ అనేకమంది

srisathyasaivachanamrutam

స్టూడెంట్స్ ఉన్నారు. అందరూ వేర్వేరు సబ్జెక్టులు చదువుతున్నారు. ఐతే, అందరూ ఎమ్.ఎ. డిగ్రీని పొందాలి. ఎమ్.ఎ. అంటే అర్థమేమిటి? మాస్టర్ ఆఫ్ ఆత్మవిద్య. ఈ ఎమ్.ఎ. డిగ్రీని మీరు సంపాదిస్తే అందరినీ ఒక్కటిగా భావించడానికి వీలవుతుంది. మిగిలిన చదువులన్నీ కేవలం పొట్టకూటి విద్యలు. కొందరు విద్యార్థులు తమ విద్యాభ్యాసం పూర్తవుతూనే అమెరికా పోయి ఏదో కంపెనీలో చేరి బాగా డబ్బు సంపాదించవచ్చని ఆశిస్తారు. బాహ్యమైన ఆకర్షణలకు లోనై మీరు విద్యయొక్క పరమార్థాన్ని విస్మరించకండి. ఏక మనసుతో భగవంతుని సంపూర్ణంగా విశ్వసించండి. అచంచలమైన విశ్వాసం లేకుండా 'బంప్స్, జంప్స్, బంప్స్, జంప్స్' ... ఈవిధంగా ఉంటుంటే మీరు పిచ్చివారైపోతారు. కోరికలు మిమ్మల్ని దివ్యత్వానికి దూరం చేస్తాయి. కోరికలను అరికట్టుకున్నప్పుడే మీరు ఏకత్వాన్ని అర్థం చేసుకోగలరు. సద్గుణాలను అలవరచుకొని మంచి జీవితాన్ని గడపండి. విద్యయొక్క పరమార్థాన్ని గుర్తించి వర్తించండి. అప్పుడే మీరు మానవ జన్మ ఎత్తినందుకు సార్థకతను పొందగలరు.

**'గుడ్ బాయ్' అనిపించుకోండి!**

విద్యార్థులారా! ఒక్క లైటు ఎంతమందికో ప్రకాశాన్ని అందిస్తుంది. అదేరీతిగా, ప్రేమతో నిండిన హృదయం ఎంతోమంది జీవితాలలో వెలుగును నింపుతుంది. చదువుకున్నవారు చదువుకోనివారిని చులకన చేయకూడదు. నిజమైన విద్యావంతులు అందరిపట్ల సమదృష్టిని కలిగియుంటారు. 'యూనిటీ' ఉన్నచోటే 'ప్యూరిటీ' ఉంటుంది. 'ప్యూరిటీ' ఉన్నచోటే 'డివినిటీ' సాక్షాత్కరిస్తుంది. 'యూనిటీ'కి ఆధారము ప్రేమతత్త్వము. ప్రేమ లేనిచోట అన్నీ భేదములే గోచరిస్తాయి. మీరు సత్యసాయి విద్యాసంస్థలో ప్రవేశించినందుకు కేవలం చదువులు చదివి డిగ్రీలు పొందినంతమాత్రమున మాకు సంతోషము లేదు. 'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః'. కాబట్టి, మీరు బాహ్యశుద్ధి, అంతశ్శుద్ధి రెండింటినీ అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడే మీరు సమాజంలో మంచిపేరు తెచ్చుకోగలరు. 'ఈ అబ్బాయి చాలా మంచివాడు, మితభాషి; తన పనేదో తాను చూసుకుంటాడు; అనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకోడు; ఎవరి జోలికీ పోడు', అని ప్రజలు మిమ్మల్ని గొప్పగా వర్ణిస్తారు. కాబట్టి, మీ ప్రవర్తన చాలా మంచిదిగా ఉండాలి. అప్పుడే మీరు



srisathyasaivachanamrutam

సమాజంలో పరివర్తన తీసికొనిరాగలరు. మీరు విద్యార్థి దశలో ఉన్నారు. కాబట్టి, బ్రహ్మచర్యానికి సంబంధించిన నియమాలను తు.చ. తప్పక పాటించాలి. 'అతను చాలా మంచి బ్రహ్మచారి' అని సమాజం మిమ్మల్ని కీర్తించాలి. అట్లుగాకుండా, మనసు ఎటు పోతే అటు మీరు ఇష్టమొచ్చినట్లు తిరుగుతుంటే ప్రజలు మిమ్మల్ని చూసి, 'వాడో పెద్ద రౌడీ' అంటారు. 'రౌడీ' అనే పేరు తెచ్చుకోకండి. 'గుడ్ బాయ్' అనిపించుకోండి. మీ మనోవాక్కర్మలు మంచివిగా ఉన్నప్పుడే మీకు 'గుడ్ బాయ్' అనే పేరు వస్తుంది.

తెలివితేటలతోపాటు మీరు సద్గుణములనుకూడా పెంచుకోండి. విమర్శలకు క్రుంగవద్దు, పొగడ్తలకు పొంగవద్దు. ఎవరైనా గట్టిగా విమర్శిస్తే అవి గాలిలో కలసిపోతాయి. తమలో తాము విమర్శిస్తే అవి వారికే తగులుతాయిగాని, మీ వరకు రావు. కాబట్టి, మీరు సమచిత్తమును అభివృద్ధిపరచుకోండి. భగవంతుడు కావాలని మీరు కోరుతున్నారు. ఆ కోరికకు తగినట్లు నడుచుకోండి. 'మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం'. దైవత్వమునుగురించి లోకములో ప్రచారం చేస్తే సరిపోదు; ముందు మీరు దైవత్వాన్ని ఏకత్వంగా అనుభవించాలి. చక్కని భాషతో గొప్పగా ఉపన్యాసాలు ఇచ్చి మీరు ప్రజలను ఆకర్షించవచ్చు. కాని, మీరు చెప్పే మాటలను చేతలలో నిరూపించకపోతే ప్రయోజనమేమిటి? కేవలం మాటలే కాదు, మీ చేతలుకూడా గొప్పవిగా ఉండాలి.

**దైవభక్తిని పెంచుకోండి, ప్రచారం చేయండి**

ద్వైతభావాన్ని విడనాడి దివ్యత్వముతో ఏకత్వాన్ని అనుభవించాలి. ఎవరు ఏమన్నను మీరు లెక్కచేయనక్కర్లేదు. మీ నమ్మకము మీది. అచంచలమైన నమ్మకంతో మీరు ఏదైనా సాధించవచ్చు. కాబట్టి, దైవప్రార్థన చేయండి. ఇక్కడ బోధించిన విషయాలను మీ ఇళ్ళకు పోతూనే మరచిపోతే ప్రయోజనం లేదు. వీటిని మీరు మననం చేస్తూ ఉండాలి. ఈవిధంగా మీరు జీవించినారంటే, మీకంటే అదృష్టవంతులు మరొకరుండరు. మీరందరూ ఒకే తల్లి పిల్లలవలె ఐకమత్యంగా ఉండి మంచిపేరు తెచ్చుకోవాలి. అప్పుడే ఈ కాలేజీలు పెట్టినందుకు సార్థకమవుతాయి. నేను ఎప్పుడూ మీ ఇంటనే, వెంటనే, జంటనే ఉన్నాను. ఈ సత్యాన్ని మీరు విశ్వసించి దైవభక్తిని పెంపొందించుకోండి. ఈ జగత్తులో దైవభక్తిని

srisathyasaivachanamrutam

ప్రచారం చేయండి. అదే నాకు సంతోషము.

ఇది ఉత్తరాయణము, ఉత్తమ కాలము, పవిత్రమైన కాలము. ఈనాటి నుండైనా మీరు మంచి భావాలను అభివృద్ధిపరచుకోండి. ఇంక, నేను ఎక్కువసేపు మాట్లాడి మీకు శ్రమ ఇవ్వదలచుకోలేదు. మిమ్మల్ని చూస్తుంటే నా హృదయం ఆనందంతో ఉప్పొంగిపోతున్నది. Happiness lies in union with God. భగవంతునితో తాదాత్మ్యం చెందడంలోనే నిజమైన ఆనందమున్నది. కాబట్టి, మీరు నిరంతరం భగవచ్చింతన చేయండి. ఎప్పుడుకూడను మీరు విచారమనేది పెట్టుకోకూడదు. 'అయ్యో, ఎగ్జామినేషన్లు వస్తున్నాయే! నేనెట్లా చదివేది? పాస్ అవుతానో కానో' అనే నెగెటివ్ భావాలకు మీరు చోటివ్వకూడదు. భగవంతునిపై నమ్మకం పెట్టుకొని మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించండి. ఫలితం తప్పక మీకు అనుకూలంగా ఉంటుంది. ప్రేమను పెంచుకోండి. Love is everything. Love is God. Live in love.

**(తేదీ 14.01.2006, మకర సంక్రాంతి, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vachanamrutam